జోరుగా కలప దందా

- పొలం గట్లపై ఉన్న చెట్లను నరుకుతున్న వ్యాపారులు
- మాయమాటలతో రైతులకు ఎర
- పట్టించుకోని అధికారులు


ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

రాయపర్తి : తెలంగాణలో అటవీ సంపదను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరిత హారం కార్యక్రమాన్ని చేపట్టింది.. కానీ కలప వ్యాపారులు మాత్రం చెలరేగిపోతూ పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పలువురు పర్యావరణ ఉద్యమకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రచార ఆర్భాటాల కోసం హరితహారం నిర్వహిస్తున్నారే తప్ప కలపను నరికివేస్తుంటే మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్న వీరిని అదుపు చేయడం లేదనే వార్తలు విన్పిస్తున్నాయి. అమాయకమైన రైతులకు ఎంతో కొంత ముట్టచెప్పి వ్యవసాయ పొలంగట్లపై ఉన్న పెద్ద పెద్ద చెట్లను నరికివేస్తున్నారు. ఈ చెట్ల దుంగలను వరంగల్, హైదరాబాద్ నగరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పొలంగట్లపై ఉన్న వేప, తుమ్మ, నమిలినార తదితర చెట్లను నరికివేసి ట్రాక్టర్‌లలో తరలిస్తున్నట్లు పలువురు పర్యావరణ ఉద్యమకారులు చెబుతున్నారు. రాయపర్తి మండలంలోని పలు గ్రామాల్లో చెట్ల దుంగలను నరికి వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి నుంచి ట్రాక్టర్‌లలో కలపను తరలిస్తున్న అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. కలపను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు.

సమాచారం అందించాలి



అనుమతి లేకుండా చెట్లను నరికి వేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి సంఘటను కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. అటవీశాఖ ద్వారా పర్మిషన్ తెచ్చుకొని రైతులు అమ్ముకుంటే ఏంలేదు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కేసులతో పాటు కఠిన చర్యలు తప్పవు.

- బండారి రాజు, ఎస్సై, రాయపర్తి

కళ్లుప్తంగా

స్వయం పాలన దినోత్సవం



రాయపర్తి : మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు టి.శేషమ్మ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తమ అనుభవాలు తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ రంగయ్య. ఉపాధ్యాయులు సింగరాచారి, సంతోష్, రమేష్, మోహన్‌రావు, శ్రీనివాస్, బీవీ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్, కారు ఢీ.. ఒకరికి గాయాలు

నర్సంపేట రూరల్ : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన నర్సంపేట పట్టణంలోని దామెర చెరువు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని కామారం గ్రామానికి చెందిన చట్ల సమ్మయ్య తన ద్విచక్రవాహనంపై నర్సంపేటకు వచ్చి తిరిగి కామారం గ్రామానికి వెళ్తున్నాడు. పట్టణంలోని దామెర చెరువు సమీపంలోకి రాగానే కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి 108 వాహనంలో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు రేఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు



రాయపర్తి : తెలంగాణ ప్రభుత్వం ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని గణేష్‌కుంట తండాలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ గారె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ



సంగెం : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ఆత్మగౌరవం పెంచిందని ఎంపీపీ కళావతి అన్నారు. శనివారం మండలంలోని కుంటపల్లిలో రూ.20లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావటి వెంకటయ్య, ఉప సర్పంచ్ జక్క దూడయ్య, నాయకులు లింగయ్య, జగన్నాథ చారి, బుచ్చిరెడ్డి, నాగార్జున శర్మ, పంచాయతీ కార్యదర్శి వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

బండా ప్రకాష్‌ను కలిసిన ముదిరాజ్‌లు



రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు బండా ప్రకాష్‌ను హనుమకొండలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు మిట్టపల్లి వెంకట్‌నాథం, నాగరాజు, శ్రీనివాస్, నర్సింహుల వెంకటేశ్వర్లు, దాసరి యాదగిరి, మిట్టపల్లి కొంరయ్య, వెంకటేష్, భాషబోయిన యాకయ్య, రమేష్, యాకయ్య, ఎల్లయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే దారిలో పిచ్చి మొక్కల తొలగింపు శనివారం చేపట్టారు. ఈనెల 21న సాక్షి దినపత్రికలో 'నిరుపయోగంగా శ్మశాన వాటికలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావుతో పాటు అధికారులు శ్మశాన వాటికకు తక్షణమే దారి ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. దీంతో దాతల సహకారంతో దారి కొనుగోలు చేసి పిచ్చి మొక్కలను తొలగించారు.

బస్టాండ్ అభివృద్ధికి నిధులు

వరంగల్ ఆర్‌ఎంఓ శ్రీలత

సాక్షి ఎఫెక్ట్..


ఆర్‌ఎంఓకు సమస్యలను వివరిస్తున్న సర్పంచ్

నెక్కొండ : నెక్కొండ ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తామని వరంగల్ ఆర్టీసీ ఆర్‌ఎంఓ శ్రీలత అన్నారు. ఈ నెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఆర్టీ'ఛీ' బస్టాండ్' కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. శనివారం నెక్కొండ బ బస్టాండ్‌ను ఆర్‌ఎంఓ సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి బస్టాండ్ సమస్యలను ఆర్‌ఎంఓ శ్రీలత దృష్టికి తీసుక వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంఓ మాట్లాడుతూ.. బస్టాండ్ అభివృద్ధి కోసం రూ..14 లక్షల అభివృద్ధి పనులకు టెండర్లు మంజూరయ్యాయన్నారు. అతి త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని ఆమె అన్నారు. ప్రతి బస్సు బస్టాండ్‌కు వచ్చి, పోయేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం తాగు నీటి, విద్యుత్, అలాగే మరుగుదొడ్ల సదుపాయాలు కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. భవనాన్ని ఆధునీకరించి ఇక్కడ శాశ్వత కంట్రోలర్‌ను నియమిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం వేములవాడకు బస్ సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. బస్సు సౌకర్యం కల్పిస్తానని ఆమె హామీ ఇచ్చారు. అన్ని హంగులతో నెక్కొండ బస్టాండ్ అభివృద్ధే లక్ష్యంగా పాటుపడనున్నట్లు ఆర్‌ఎంఓ శ్రీలత చెప్పారు. బస్టాండ్‌లో చెత్తా చెదారాలు వేసి వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట డిపో మేనేజర్ విజయమాధురి, సీఏ సరస్వతి, సూపరింటిండెంట్ కుమారస్వామి, గ్రామ ఈఓ సదానందం, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

27న మండల స్థాయి క్రీడలు

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో ఈనెల 27న మండల స్థాయి మహిళా క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు ఏపీఎం కందిక సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధరావుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సౌజన్యంతో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు ఖర్దూరి హైమ, ఏపీఎం ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27, 28, మార్చి 1, 2 తేదీలలో మండల కేంద్రంలోని జాగృతి పాఠశాల క్రీడా ప్రాంగణంలో క్రీడలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రీడలను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గెలిచిన వారికి మండల, నియోజకవర్గ స్థాయి బహుమతులు, నగదుతో పాటు షీల్డ్‌లు కూడా అందిస్తామని తెలియజేశారు.

పెళ్లి విందులో ఘర్షణ

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో జరిగిన ఓ వివాహంలో శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్‌నగర్‌లో జరిగిన ఓ వివాహానికి వరంగల్, కొత్తగూడ నుంచి పలువురు హాజరయ్యారు. పెళ్లి భోజనాల వద్ద ఇరు వర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకోంది. ఇది కాస్తా చినికిచినికి వివాదానికి దారి తీసింది. దీంతో ముగ్గురికి స్వల్ప గాయానలైట్లు తెలిసింది. కాగా విషయంపై ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నర్సంపేట : నర్సంపేట చుట్టు పక్కల ఉన్న అసైన్డ్ భూముల్లో అక్రమంగా వెలసిన వెంచర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లగా ఈ వెంచర్లలో ప్లాట్లను కొనరాదని మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి శనివారం బోర్డులు ఏర్పాటు చేశారు. మాధన్నపేట రోడ్డులోని 111సర్వే నంబర్‌తో పాటు మహబూబాబాద్ రోడ్డు సమీపంలో వెలసిన వెంచర్, ద్వారకపేట రోడ్డులోని మిల్లు సమీపంలో ఉన్న ప్లాట్లలో కొనుగోలు చేయరాదని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గత కొంత కాలంగా అసైన్డ్ భూముల్లో ప్లాట్ల అమ్మకాలను కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేస్తున్నారని కలెక్టర్ ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో కలెక్టర్ నుంచి కమిషనర్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

డివిజన్ కమిటీలను పూర్తి చేయాలి


నియామక పత్రం అందజేస్తున్న కృష్ణమూర్తి

నర్సంపేట : మున్నూరు కాపు సంఘం నర్సంపేట మున్సిపాలిటీలో 24డివిజన్లలో కమిటీలను పూర్తి చేయాలని మున్సిపల్ కో ఆర్డినేటర్ నూకల కృష్ణ మూర్తి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని 19వ డివిజన్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాడెం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నాడెం పెద్ద శ్రీనివాస్, బండి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా నాడెం యుగేందర్, జాయింట్ సెక్రటరీగా కామ సాంబయ్య, సెక్రటరీగా శివాజీ, దామెరశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సకినాల నర్సింహస్వామి, కార్యవర్గ సభ్యులుగా నాడెం శివ, గుండు బాజ్జీ, నాడెం తిరుమల్, ఆకుతోట శ్రీధర్, ఆవుల సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి నాడెం శాంతికుమార్, పట్టణ అధ్యక్షుడు వేల్పుల సాంబయ్య, మండల అధ్యక్షుడు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

సంగెం : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన లభిస్తోందని సర్పంచ్ పోతుల ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్గూర్‌రంగంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు కె.సుజాత, ఉపాధ్యాయులు విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు రప్పించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగాం శ్రీనివాస్, బందెల రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రాంసింగ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

వరంగల్ (పర్వతగిరి) : విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఆదర్శ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారిచే పంపిణీ చేయబడిన అభ్యాసక దీపిక స్టడీ మెటీరియల్‌ను పదోతరగతి విద్యార్థులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్, ఉపాధ్యాయులు చైతన్య, యాకుబ్ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనషాపుల తనిఖీ


ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న కృష్ణ కుమార్

నర్సంపేట రూరల్ : ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే షాపు యజమానుల లైసెన్స్ రద్దు చేసి, శాఖపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కృష్ణకుమార్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని ఎరువులు, విత్తన షాపులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల రికార్డులను పరిశీలించి, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలను రైతులకు ఎమ్మార్పీ ధరలకు అందించాలన్నారు. కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. స్టాక్ వివరాలను తప్పనిసరిగా స్టాక్ బోర్డుపై వివరాలను నమోదుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శిరీష

నర్సంపేట రూరల్ : ఆదివాసీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తాలుకా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ శిరీష అన్నారు. నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామంలో శనివారం ఆదివాసీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శిరీష మాట్లాడుతూ ఆదివాసీల పట్ల ఎవరు వివక్ష చూపవద్దని, వివక్ష పాటిస్తే చట్టపరంగా శిక్షించబడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్, సర్పంచ్ బానోత్ దస్రు, ఎంపీటీసీ బానోత్ వీరన్న, న్యాయవాదులు తండా సారంగపాణి, రహిమోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : తెలంగాణ ప్రభుత్వం పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నర్సంపేట పట్టణంలోని పురాతన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేసిందని తెలిపారు. అందులో భాగంగా మొదటి విడతగా రూ.50లక్షలు విడుదలయ్యాయని, ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసిన అనంతరం రెండో దఫా రూ.50లక్షలకు అనుమతి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన ఆలయాన్ని నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆలయ కమిటీ వారికి సూచించారు. భక్తులు ఆలయ నిర్మాణానికి దాతలుగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నల్ల మనోహర్‌రెడ్డి, ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళాలు

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో శివాలయం రామాలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన మట్టపల్లి రమాదేవి-వెంకటేశ్వర్‌రావు రూ.10లక్షల 50వేలు అందజేశారు. దీంతో పాటు మరో పది మంది రూ.2లక్షల 50వేలను ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, గ్రామస్తుడు వెన్ను పూర్ణచందర్‌లకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, విద్యాసాగర్‌రావు, కత్తాల వెంకటేశ్వర్‌రావు, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

మొండ్రాయి సర్పంచ్‌పై విచారణ


విచారణ చేస్తున్న ఎంపీడీఓ కొమురయ్య

సంగెం : మండలంలోని మొండ్రాయి సర్పంచ్ గూడ కుమారస్వామిపై ఎంపీడీఓ కొమురయ్య విచారణ చేపట్టారు. ఈ నెల 9న సర్పంచ్‌పై ఉప సర్పంచ్ పెండ్లి శారద, వార్డు సభ్యులు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేకు ఫిర్యాదు చేశారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం సమక్షంలో విచారణ నిర్వహించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలన చేశారు. విచారణ నివేదికను పై అధికారులకు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

'ఆశ'కు పలువురి పరామర్శ


నీలను పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

నర్సంపేట : ఖానాపురం మండలం నాజీతండా గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త నీల పురుగుల మందు తాగి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బోడ రజిత శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఏమైనా సమస్యలు వ్యక్తిగతంగా ఉంటే యూనియన్ నాయకులను సంప్రదించి సమస్య పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశలు సంధ్య, రమ, రజిత, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఎస్పీ నర్సంపేట నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుర్రి సాగర్, నాయకులు శీరంశెట్టి రాజేందర్, విష్ణు, వినయ్, జక్కుల సాయిసాగర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, మంగళవారిపేట ఎంపీటీసీ మూడు పూల్‌సింగ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మారబోయిన రాములు పరామర్శించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


నర్సంపేట: అమరవీరుల స్తూపం వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు


నల్లబెల్లి: సీపీ రంగనాథ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పరికి కోర్నేల్ తదితరులు

నర్సంపేట : కాకతీయ మెడికల్ కళాశాల మెడికో పీజీ గిరిజన విద్యార్థిని ప్రీతిపై ర్యాగింగ్ పేరిట వేధింపులకు గురి చేసి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను వెంటనే ఉరి తీయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద శనివారం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ప్రీతి పలుమార్లు కళాశాల ప్రిన్సిపాల్, సంబంధిత యాజమాన్యానికి ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రీతి ఆత్మహత్యా యత్నానికి కారణమైన సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఉమేష్, రాకేష్, లోకేష్, హరీష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట : వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి ఆత్మహత్యా యత్నానికి కారకులైన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షుడు వీరన్న నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పలుమార్లు యాజమాన్యానికి తెలిపిన పట్టించుకోకపోవడం వల్ల ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని అన్నారు. మెరుగైన వైద్యం అందించే విధంగా ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు కృషి చేయాలన్నారు. నిందితుడిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సీబీసీఐడీతో విచారణ చేయించాలి

డాక్టర్ ప్రీతి ఆత్మహత్యా యత్నానికి కారణంపై సీబీసీఐడీ చేత విచారణ జరిపించి న్యాయం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ డిమాండ్ చేశారు. ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీ రంగనాథ్ చిత్రపటానికి పాలాభిషేకం

నల్లబెల్లి : పీజీ వైద్యవిద్యార్థిని ప్రీతి ఆత్మహత్యా యత్నానికి ప్రేరేపించిన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను అరెస్టు చేసేందుకు కృషి చేసిన వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ చిత్రపటానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కోర్నేల్ మాట్లాడుతూ.. ప్రీతిని మానసిక వేధింపులకు గురిచేసి ఆత్మహత్యా యత్నానికి ప్రేరేపించిన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. సీనియర్ విద్యార్థులు మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేష్, పులి రమేష్, దామ సాంబయ్య, ఆదిరెడ్డి, వినయ్, శ్రీకాంత్, వినయ్ కుమార్, రమేష్, సందీప్, కిషన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నర్సంపేట రూరల్ / నర్సంపేట : పట్టణంలోని 13వ వార్డుకు చెందిన మద్దెబోయిన రాజశేఖర్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందాడు. ఈ మేరకు రాజశేఖర్ ఆర్థిక పరిస్థితిని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.15వేలను అందించగా శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, స్థానిక కౌన్సిలర్ రుద్ర మల్లీశ్వరిఓంప్రకాశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మినుముల రాజు, కౌన్సిలర్ తిరుమల బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సునీత ఆబోతు రాజుయాదవ్, మెడద శీను, నాయిని వేణు, మడికొండ నరేందర్, రవి పాల్గొన్నారు.